ఉత్సాహంగా ఆటల పోటీలు



బహుమతులు అందుకుంటున్న బొమ్మల దేవిక, విరిహా, తృత

గోల్కొండ: రిపబ్లిక్ డే పురస్కరించుకొని జరుగుతున్న ఆటల పోటీల్లో చిన్నారులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. మరికొందరు స్వాతంత్ర్యం సమరయోధుడు, రాజకీయ నాయకుల వేషధారణలో శభాష్ అనిపించుకుంటున్నారు. గోల్కొండ ఉర్వా హైస్కూల్‌లో జరిగిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో అమైరా ఝాన్సీ లక్ష్మీబాయ్ వేషధారణలో ఆకట్టుకుంది. గ్లెండెల్ ప్రీ స్కూల్‌లో జరిగిన ఆటల పోటీల్లో గోల్కొండకు చెందిన బొమ్మల దేవిక పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

హెరిటేజ్ కట్టడాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

యాకుత్‌పురా: హెరిటేజ్ కట్టడాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. డబీర్‌పురా దర్వాజా నిర్మాణ పనులను శనివారం ఆయన ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ హఫాందీ, కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చరిత్ర కలిగిన డబీర్‌పురా దర్వాజాను ప్రత్యేక నిధులతో బ్యూటిఫికేషన్ పనులను పూర్తి చేశామన్నారు. అహ్మద్, ఖాసీం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు



కార్యక్రమంలో స్వరభారతి ఫౌండేషన్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: స్వరభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 178వ త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను శనివారం కళా భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మంది కళాకారులు ఏక కాలంలో ఆలపించిన గీతాలు, నృత్యకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గాడెపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.... భారతీయ సంస్కృతి, సంగీతానికి తగిన ప్రోత్సాహం, అవగాహన ఎంతో ముఖ్యమన్నారు. ఈ ఇతరం పిల్లలను సంగీత విద్యలో ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్వరభారతి ఫౌండేషన్ డైరెక్టర్ గాడెపల్లి సంధ్య, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



చార్మినార్: ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మండలం ట్రాఫిక్ డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు అన్నారు. చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్ పర్యవేక్షణలో చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ ఆధ్వర్యంలో మదీనా సర్కిల్ వద్ద ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని కొత్తగా ఫ్రీ లెఫ్ట్, ఫ్రీ రైట్ ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను ఆయన వారితో కలిసి శనివారం మదీనా సర్కిల్ వద్ద పరిశీలించారు. చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ మాట్లాడుతూ..గుల్జార్‌హౌస్, పత్తర్ గట్టి, చార్మినార్ తదితర ప్రాంతాల నుంచి నగరంలోని ఇతర ప్రాంతాలకు మదీనా సర్కిల్ ద్వారా ముందుకు వెళ్లేందుకు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫ్రీ లెఫ్ట్ ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి మదీనా ద్వారా ముందు వెళ్లేందుకు సిగ్నల్ అవాంతరాలు లేకుండా ఫ్రీ ఫ్లో కోసం ఫ్రీ రైట్ కల్పించామన్నారు.

కల్తీ నెయ్యి గోదాంపై దాడి

నాంపల్లి: కల్తీ నెయ్యి గోదాంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో 120 కేజీల కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. కల్తీ నెయ్యి తయారీదారులను అదుపులోకి తీసుకుని మాసబ్ ట్యాంక్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన శనివారం రాత్రి మాసబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోజా నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..అహ్మద్‌నగర్ బోజా నగర్‌లోని మాషా అల్లా భవన సముదాయంలోని సెల్లార్‌లో మాజం(45) కొన్ని నెలలుగా కల్తీ నెయ్యిని తయారు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మెహిదీపట్నం సర్కిల్-12 ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సమీనా బేగం తమ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి తయారీ గోదాంపై దాడులు చేశారు. సెల్లార్‌లో ఏర్పాటు చేసిన గోదాంలో భారీగా కల్తీ నెయ్యిని తయారు చేస్తున్నట్లుగా గుర్తించారు. తయారీ కేంద్రంలోని కల్తీ ముడిపదార్థాలను, కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నెయ్యి నమూనాలను ల్యాబొరేటరికి తరలించారు. తదుపరి విచారణ నిమిత్తం ఈ కేసును మాసబ్ ట్యాంక్ పోలీసులకు అప్పగించారు.

కూలిన ప్రహరీ శిలలు



అదనపు వంతెనపై నిలిచిన ట్రాఫిక్




వంతెనపై దుకాణాలు, కూరగాయాల విక్రయాలు



వంతెన.. ఇంతేనా..!

- శిథిలావస్థలో 'పురానాపూల్'
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- నిత్యం ట్రాఫిక్ జామ్
- పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని డిమాండ్



పురానాపూల్ వంతెన దిగువన చేరిన మురుగునీరు, వంతెనకు పెరిగిన పిచ్చి మొక్కలు

జియాగూడ: పురానాపూల్ వంతెన శిథిలావస్థకు చేరుకుంటుంది. వంతెనపై దాదాపు 100కు పైగా కూరగాయాలు, నిత్యావసర సరుకులు పండ్లు, వస్తువులను చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి కార్వాన్, జియాగూడల నుంచి చార్మినార్ వెళ్లే రహదారిగా వంతెనపై విక్రయాల కారణంగా కేవలం అదనపు వంతెనపై మాత్రమే రాకపోకలు జరుగుతున్నాయి. అప్పట్లో పాత వంతెన ట్రాఫిక్ సరిపోవడం లేదని అదనపు వంతెన నిర్మించారు. ప్రస్తుతం అదనపు వంతెనపై ట్రాఫిక్ కొనసాగుతుండగా తరచూ నిలిచిపోతుంది. ఇక వంతెనపై వ్యాపారాలు షెడ్‌లు వేసుకోవడానికి గుంతలు తవ్వి పైపులు వేస్తున్నారు. అలాగే వంతెన ప్రహరీ రాళ్లు కూలుతున్నాయి. విద్యుత్ దీపాలు వెలగడం లేదు, ఇక వంతెన దిగువన అడుగు భాగంలో మూసీ నది మురుగు నీరు నిలిచి ఉంటుంది. దీంతో వంతెనకు బీటలు బారుతున్నాయి. వంతెన చుట్టు పక్కల చెత్తాచెదారం మురుగు నీరు ఎప్పుడూ ఉంటుంది.

పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి..

ప్రేమికులు వారధిగా పేరుగాంచిన పురానాపూల్ వంతెనను అన్ని హంగులతో అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. 447 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన, మహా నగరానికి పునాదులు వేసిన పురానాపూల్, ప్రపంచంలోనే ప్రేమికుల కోసం నిర్మించిన ఒకటే వంతెనగా భావితరాలకు అందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన ఆరోహిణి సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల వైస్ చైర్ పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థినులు దేశ గౌరవాన్ని చాటారన్నారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థినులకు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల హెడ్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎంఈకి సన్మానం



నరేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న సురేంద్రబాబు

సుల్తాన్‌బజార్: నూతన డీఎంఈగా ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నరేంద్రకుమార్‌ను ప్రభుత్వం నియమించడంపై నేషనల్ మెడికో ఆర్గనైజేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఎన్ఎంఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేంద్రబాబు ఆధ్వర్యంలో డీఎంఈ నరేంద్రకుమార్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తర్వాత మొదటిసారిగా రెగ్యులర్ డీఎంఈను ప్రభుత్వం నియమించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మెడికోస్ నాగార్జునచారి, డాక్టర్ పద్మవతి, డాక్టర్ విజయేందర్, క్రాంతి, స్వాతిక్, వర్ష, మహేశ్వరి, ధరణి పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీని ప్రత్యేక దృష్టితో చూడాలి



డాక్టర్ యోగితారాణాకు పుస్తకాలను అందజేస్తున్న నిత్యానందరావు

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ యోగితా రాణాను శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు భాషకు, సాహిత్యానికి చేస్తున్న కృషిని వివరించి వర్సిటీ ప్రచురించిన పుస్తకాలను వారికి అందజేశారు. రాష్ట్రంలోని మిగతా విశ్వవిద్యాలయాల కన్నా తెలుగు విశ్వవిద్యాలయం విభిన్నమైనదని, వర్సిటీ ప్రత్యేకతలను కార్యదర్శికి వివరించారు. భాషా విశ్వవిద్యాలయంగా గుర్తించి తెలుగు వర్సిటీని ప్రత్యేక దృష్టితో చూడాలని కోరారు.

భవనాల కూల్చివేత పనుల పరిశీలన



కూల్చివేతలను పరిశీలిస్తున్న మెట్రో రైల్ అధికారులు, ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్

యాకుత్‌పురా: పాతబస్తీలో చేపట్టిన మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణ పనుల కోసం భవనాల కూల్చివేతలను హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు అధికారుల బృందం సభ్యులు శనివారం పరిశీలించారు. దారుషిఫా, పురానీహవేలీ, ఎత్తేబార్ చౌక్, అలీజాకోట్లా, బీబీ బజార్ చౌరస్తా, మొఘల్‌పురా ఓల్గా హోటల్ ప్రాంతాల్లో పర్యటించి స్థానికంగా కొనసాగుతున్న కూల్చివేతలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నగరం నుంచి పాతబస్తీలోని పలు ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పనులు చేపట్టాలని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ ప్రాజెక్టు అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో మెట్రోరైల్ ప్రాజెక్టు సీనియర్ మేనేజర్ వినోద్ కుమార్, మేనేజర్ నర్సింగ్ రావు, ఎలక్ట్రికల్ ఏడీఈ శ్రీనివాస్ రెడ్డి, డీఈఈలు బాలకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, ప్రాజెక్టు ఇంజినీర్ అత్తవుల్లా ఖాన్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందజేస్తున్న మంజీత్‌రెడ్డి, అనిల్ స్వరూప్ మిశ్రా, ప్రభాశంకర్

అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ సరోజిని నాయుడు వనిత ఫార్మసి కళాశాలలో నిర్వహించిన విద్యార్థినుల క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కస్తూర్బా మహిళా కళాశాల విద్యార్థినులు క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచారు. కన్వీనర్ మంజీత్‌రెడ్డి, అడ్వైజర్ అనిల్ స్వరూప్ మిశ్రా, సొసైటీ కోశాధికారి ప్రభా శంకర్ విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.

టోలిచౌకీ చౌరస్తాను సుందరంగా తీర్చిదిద్దుతాం



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: టోలిచౌకీ చౌరస్తాను సుందరంగా తీర్చిదిద్దేందుకు పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీ వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టోలిచౌకీ చౌరస్తాను నగరంలో అత్యంత ప్రధాన వ్యాపార కూడలిగా రూపుదిద్దుకుందన్నారు. త్వరలోనే ఫ్లై ఓవర్ కింద ఔషధ మొక్కలను కూడా నాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

కుస్తీ పోటీలు ప్రారంభం

చాంద్రాయణగుట్ట: హైదరాబాద్ కేసరి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ కుస్తీ పోటీలు బార్కాస్ క్రీడా మైదానంలో శనివారం ప్రారంభమయ్యాయి. బామస్ అకాడ ప్రొఫెషనల్ రెజ్లింగ్ హబ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ పోటీల్లో తొలిరోజు అండర్-19, అండర్-17, అండర్-15 విభాగాలలో తలపడ్డారు. ఆదివారం ఈ విభాగాలతో పాటు 100-125 కేజీల విభాగంలో రుస్తుం-ఇ-హైదరాబాద్, 75-100 కేజీల విభాగంలో హైదరాబాద్ కేసరిలకు ఫైనల్ పోటీలు జరుగనున్నాయి. నిర్వాహకులు ఆంధ్రకేసరి ఖాలేద్ బామస్ ఆధ్వర్యంలో కొనసాగతున్న ఈ పోటీలను తిలకించేందుకు కుస్తీ ప్రేమికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

రేపు జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి జి.జయశ్రీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మేజిక్ బస్సు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రెండు నెలల ఉచిత శిక్షణలో భాగంగా ఐటీ స్కిల్స్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ కోర్సులు నేర్పించి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండి 18 నుంచి 25 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులు. ఆసక్తి అర్హత గల నిరుద్యోగులు సోమవారం ఉదయం 10:30 గంటలకు ఫొటోలు, ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 86880 04013, 90630 99306 లలో సంప్రదించవచ్చు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ నర్మద

సుల్తాన్‌బజార్: ఉస్మానియా మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆహ్లాదమైన వాతావరణంలో జరిగింది. శనివారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆవరణలో 1977వ బ్యాచ్ విద్యార్థులు తమ విద్యార్థి దశలోని జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఒకరికొకరు ఎంతో అభిమానంతో పలకరించుకున్నారు. ఈ సందర్భంగా ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థులు, మాజీ ఫ్యాకల్టీ డాక్టర్ హెచ్. నర్మద స్త్రీ అనే పేరుతో రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

పౌర సమాజం ప్రశ్నించే స్వభావాన్ని అలవర్చుకోవాలి

చార్మినార్: పౌర సమాజం ప్రశ్నించే స్వభావాన్ని అలవర్చుకోవాలని ప్రముఖ జర్నలిస్ట్ పాశం యాదగిరి అన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా సిటీ కాలేజీ సోషల్ సైన్సెస్ విభాగాలు శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ..ప్రజల ఉమ్మడి చైతన్యంతో ఏ సమస్యనైనా సమర్థంగా ఎదుర్కోవచ్చునన్నారు. ప్రజాస్వామ్యానికి మూలాధారమైన చట్టసభ, న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక రంగం, మీడియా నాలుగు స్తంభాలు పటిష్టంగా ఉండాలన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.బాల భాస్కర్ మాట్లాడుతూ..ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత మాత్రమే కాదు, అది ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం అన్నారు. డా.భాస్కర్ సమన్వయం చేసిన సదస్సులో డా.శంకర్ కుమార్ అతిథిని పరిచయం చేయగా, వైస్ ప్రిన్సిపాల్ శాంతి, డా.యాదయ్య, లతారాణి, డా.కోయి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలలో గణతంత్ర సందడి



సాక్షి, సిటీబ్యూరో: మెహదీపట్నంలోని శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణల ఫ్యాన్సీ డ్రెస్ పోటీలతో పాటు పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ వేడుకల్లో శ్రీ చైతన్య పాఠశాల మెహిదీపట్నం జోన్ ఏజీఎం బి.కృష్ణ, ప్రిన్సిపాల్ ఎన్.స్వాతి, ఆర్ఐ హరికృష్ణ, డీన్ మల్లేశ్, ఇన్‌చార్జీలు నదీమ్, బాలరాజు, రవి, షగుఫ్త, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాం కళాశాలలో 'యువ ఎంపవర్-2025'



గన్‌ఫౌండ్రీ: ఆయిస్టర్ ఎన్జీఓ, లిటరరి అండ్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిజాం కళాశాలలో నిర్వహించిన యువ ఎంపవర్-2025 కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. చెస్, రంగోలీ, క్యారమ్స్, ఉపన్యాసం, వ్యాసరచన, సింగింగ్, డ్యాన్స్, క్విజ్ మొదలైన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ మాట్లాడుతూ..విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీయడానికి ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయిస్టర్ ఎన్జీఓ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, కళాశాల లిటరరి అండ్ కల్చరల్ కో ఆర్డినేటర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో తెలంగాణ అగ్రగామి



మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన నిర్మల్‌కుమార్ యాదవ్

అఫ్జల్‌గంజ్: అన్ని రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. టూరిజం, పరిశ్రమలు, ఇతర పలు రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకుపోతుందన్నారు. గోషామహల్‌కు చెందిన ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ ఆయనను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..దేశంలోనే తెలంగాణ అభివృద్ధి పథంలో ముందువరుసలో ఉందన్నారు. నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వరాలుగా మారుతున్నాయన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే ప్రజా సంక్షేమం



కాల్వ సుజాతకు గోమాత విగ్రహాన్ని అందజేస్తున్న దృశ్యం

అఫ్జల్‌గంజ్: ఇందిరమ్మ రాజ్యంలోనే ప్రజా సంక్షేమం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రగతి, అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. శనివారం అరణ్యభవన్‌లోని చైర్మన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ..పేద బడుగు వర్గాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఆల్ ఇండియా సోషల్ మీడియా అధ్యక్షులు విద్యాల సంజయ్‌కుమార్, పలువురు నాయకులు లింగ ప్రకాష్, చక్రం రమణయ్య, శ్రీహరి, అనిల్‌కుమార్‌లు ఆమెను ఘనంగా సత్కరించారు.

గరగ నృత్య బృందానికి గిన్నిస్ బుక్‌లో చోటు



గరగ నృత్యం(ఫైల్)

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించే గరగ నాట్య కళా బృందానికి ఈనెల 24న వరల్డ్ గిన్నిస్ రికార్డు దక్కింది. గరగ నృత్యం కళలో 100 మంది కళాకారులతో ఈనెల 24న న్యూ ఢిల్లీలో నిర్వహించిన ప్రదర్శనలో శివపార్వతి గరగ నాట్య బృందానికి వరల్డ్ గిన్నిస్ రికార్డు దక్కింది. భారత ప్రభుత్వంలోని సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం 5000 మంది కళా (29 జానపద కళలు, 22 గిరిజన నృత్యాలు) బృందాలతో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ కోనసీమ జిల్లా పలివెల గ్రామానికి చెందిన శివపార్వతి గరగ నాట్య బృందం (100 మందితో) కూడా పాల్గొనగా రికార్డు దక్కింది. మీరాలంమండిలో 1996లో మొదటి సారి గరగ నృత్యం నిర్వహించారు.

నేడు న్యూ ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో...



వరల్డ్ రికార్డు సాధించిన ఈ బృందం గణతంత్ర వేడుకల సందర్భంగా ఆదివారం న్యూ ఢిల్లీలో జరిగే వేడుకల్లో పాల్గొని గరగ నృత్యం ప్రదర్శించనున్నాం. ఇంతటి ఘనత సాధించిన మాకు మొదటి అవకాశం, ప్రాధాన్యత మీరాలంమండి ద్వారా కలిగింది. మీరాలంమండి ఆలయ కమిటి చైర్మన్ గాజుల అంజయ్యకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. – ప్రసాద్, శివ పార్వతి గరగ నాట్య బృందం టీం

అంతర్జాతీయ పురాతన వస్తువుల ప్రదర్శన ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సందర్శకులు

చార్మినార్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా 7వ శతాబ్దం నాటి అంతర్జాతీయ నాణేలు, కరెన్సీ నోట్లు, పురాతన వస్తువుల సేకరణల ప్రదర్శన శనివారం పాతబస్తీ మొఘల్‌పురాలోని ఉర్దూఘర్‌లో ప్రారంభమైంది. ఏపీజే అబ్దుల్ కలాం ఆజాద్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కొనసాగే ఈ అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌లో పలు స్టాల్స్ ఏర్పాటయ్యాయి. తమ వద్ద ఉన్న పురాతన నాణేలు, కరెన్సీలను ఎగ్జిబిషన్‌లో విక్రయించవచ్చని సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ ఖాద్రీ తెలిపారు. అలాగే తమకు నచ్చిన వాటిని ఖరీదు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, ప్రవేశం ఉచితమన్నారు.

సింగరేణి భవన్‌లో రాజ్యాంగ ప్రతి ప్రదర్శన

నాంపల్లి: గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో సింగరేణి భవన్ సందర్శకుల గ్యాలరీలో రాజ్యాంగ ప్రతిని పొందుపరిచారు. దీన్ని సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..మన దేశంలో రాజ్యాంగమే సర్వ శక్తివంతమైనదని, అదే ప్రజలందరి బలమని అన్నారు. భారత దేశానికి పటిష్టమైన రాజ్యాంగాన్ని ఇచ్చిన మహనీయులను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం(కో ఆర్డినేషన్) ఎస్.డి.ఎం.సుభానీ, జీఎం(మార్కెటింగ్) డి.రవి ప్రసాద్, సింగరేణి భవన్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.